## క్లుప్తంగా

### ఎంటీఎంసీ కమిషనర్‌గా షేక్ అలీంబాషా



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా షేక్ అలీంబాషాను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రాష్ట్రంలో మున్సిపల్ కమిషనర్ల బదిలీలు కొనసాగుతున్నాయి. ప్రతిష్టాత్మక ఎంటీఎంసీకి సీఆర్‌డీఏ అధికారిని కమిషనర్‌గా నియమించడం విశేషం. మంగళగిరి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నారా లోకేష్ రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టగా, గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిన ఎంటీఎంసీపై ఇప్పుడు తనదైన ముద్ర వేసేందుకు అలీంబాషాను నియమించినట్లు చర్చ జరుగుతోంది. ఇక్కడ కమిషనర్‌గా ఉన్న వి. నిర్మల్ కుమార్‌ను బాపట్ల బదిలీ చేశారు. బాపట్ల డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న బి. శ్రీకాంత్‌ను ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న బి.శివారెడ్డిని సీడీఎంఏలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

### 13 నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంగళగిరి: రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా మంగళగిరి మండలంలోని కాజ టోల్ ప్లాజా నుంచి కృష్ణా జిల్లా గొల్లపూడి వరకు ఔటర్ రింగ్ రోడ్డు వేస్తున్నారు. ఇందులో భాగంగా నవులూరులో ఫ్లైఓవర్‌కు అవరోధంగా ఉన్న 130 కేవీ విద్యుత్ లైన్‌ను మారుస్తున్నారు. ఈ నిమిత్తం నూతన విద్యుత్ లైన్ల నిర్మాణం కోసం ఈ నెల 13 నుంచి 14వ తేదీ వరకు ఎంటీఎంసీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ మేరకు విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

### రూరల్ ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



మంగళగిరి: మంగళగిరి రూరల్ ఎస్‌ఐగా ప్రకాశం జిల్లా సీసీఎస్ నుంచి బదిలీపై వచ్చిన వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రూరల్ ఎస్‌ఐగా పనిచేస్తున్న క్రాంతి కిరణ్‌ను ప్రకాశం జిల్లా సీసీఎస్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

### వెంకట ప్రసాద్‌కు అభినందనలు



తెనాలిఅర్బన్: మానవత సంస్థ చైర్మన్‌గా నియమితులైన కటకం వెంకట ప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, తెనాలి నాయకులు గుద్దంటి రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, మరి కొందరు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. తెనాలిలో జరిగిన కార్యక్రమంలో తిరువీధుల దుర్గ శివరామప్రసాద్, షేక్ బాషీద్ పాల్గొన్నారు.

### ఉత్తమ వైద్యాధికారిగా డాక్టర్ జీవనలత



తెనాలి: పట్టణానికి చెందిన ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ డి.జీవనలత బాపట్ల జిల్లా పరిధిలో ఉత్తమ వైద్యాధికారి / ఉత్తమ ట్యూబెక్టమీ సర్జన్ అవార్డును అందుకున్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బాపట్లలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆ జిల్లా డీఎంహెచ్‌వో డి.విజయమ్మ చేతుల మీదుగా అవార్డును, ప్రశంసాపత్రాన్ని స్వీకరించారు. ప్రస్తుతం డాక్టర్ డి.జీవనలత చెరుకుపల్లి మండల పరిధిలోని కనగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. గతేడాది సెప్టెంబరు నెల నుంచి ఇప్పటి వరకు 286 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినందుకు ఈ గౌరవం దక్కినట్టు తెలియజేశారు.

### డివైడర్‌ను ఢీకొన్న గ్యాస్ సిలిండర్ల లారీ



ఫిరంగిపురం: సీఎన్‌జీ గ్యాస్ సిలిండర్ల లారీ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపల్లి నుంచి సీఎన్‌జీ గ్యాస్ సిలిండర్ల లారీ ప్రకాశం జిల్లా త్రిపురాంతకం వెళుతుండగా ప్రమాదవశాత్తు ఫిరంగిపురంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా డివైడర్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో లారీ ముందు భాగం దెబ్బతింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం పొక్లయిన్‌తో దానిని పక్కకు తీయించారు.

# పొగాకు వాడకంతో ఎన్నో దుష్పరిణామాలు




బహుమతి ప్రదానం చేస్తున్న మండల విద్యాశాఖాధికారులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు

తాడేపల్లి రూరల్: 'పొగాకు వాడకం - దుష్పరిణామాల'పై అవగాహన కార్యక్రమం, వ్యాసరచన పోటీలను దుగ్గిరాలలోని నిమ్మగడ్డ ఫౌండేషన్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో విద్యార్థులకు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల విద్యాశాఖాధికారులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. అప్పుడే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ సి. ఇందిర మాట్లాడుతూ... పొగాకు వాడకం వల్ల అనేక ఆరోగ్యసమస్యలు తలెత్తుతాయని చెప్పారు. విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దుగ్గిరాల ఉన్నత పాఠశాలకు చెందిన హర్షవర్ధన్ (8వ తరగతి), కార్తీక్ (9వ తరగతి), గౌరవ్ కుమార్ (8వ తరగతి), రేవేంద్రపాడుకు చెందిన జుబేర్ (9వ తరగతి), పెనుమూలికి చెందిన సిద్దిక్ (9వ తరగతి) బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బహుమతి ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో దుగ్గిరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. బాలసుందరం, హెల్త్ ఎడ్యుకేటర్ వి. సుబ్బారావు, ఆరోగ్య కార్యకర్తలు లీల, జి. శ్రీనివాసరావు, కె. నటరాజ్, ఎస్. శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ బుజ్జి, ఆశా కార్యకర్తలు సుకుమారి, స్వరూప, విమల, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్‌కు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల వినతి



లోకేష్‌కు వినతిపత్రం అందిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

తాడేపల్లి రూరల్: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు గురువారం తాడేపల్లిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో కలిసి పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని, వృద్ధాప్య పింఛను ఇవ్వాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని, సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. గంగాధర్, ఉపాధ్యక్షులు కె. కోటేశ్వరరావు, బి.డి.ఆర్. రెడ్డి, గుంటూరు 1, 2 డిపోలకు చెందిన రామచంద్రరావు, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

### హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



మంగళగిరి : ద్విచక్ర వాహనాల చోదకులకు హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని మంగళగిరి న్యాయమూర్తులు తెలిపారు. గురువారం పట్టణంలోని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ మేరకు న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. బైకులపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించడంతో పాటు రవాణా శాఖ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కోరారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

## చెరువులో అక్రమ నిర్మాణాలు నిలిపేయండి

తహసీల్దార్ మధుసూదనరావు



నిర్మాణ పనులు చేపట్టిన స్థలంలో పరిశీలిస్తున్న తహసీల్దార్ మధుసూదనరావు

తాడికొండ: పున్నమ్మ చెరువులో అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని తాడికొండ తహసీల్దార్ మధుసూదనరావు హెచ్చరించారు. గురువారం అక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. గతంలో ఇక్కడ చెరువు ఉండేదని ఫిర్యాదు వచ్చిందని, దానిని పూడ్చివేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొన్నారు. అసలు భూమి కన్వర్షన్ చేయకుండా ఎలా నిర్మాణాలు చేపడతారని ప్రశ్నించారు. తాను సక్రమంగానే భూమి కొనుగోలు చేశానని నిర్మాణదారుడు తెలిపారు. సర్వే చేసి తాము నిర్ధారించే వరకు ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని తహసీల్దారు హెచ్చరించారు. ఆయన వెంట వీఆర్వోలు శర్మ, రాంబాబు, సచివాలయ సర్వేయర్ గోపి తదితరులున్నారు.

### అవగాహనతోనే అతిసార నివారణ

తెనాలి అర్బన్: అవగాహనతో అతిసారా వ్యాధిని నియంత్రించవచ్చని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల పేర్కొన్నారు. అతిసారా వ్యాధిపై మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా హాల్‌లో గురువారం డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుషిత నీరు, ఆహార పదార్థాలు తీసుకోవడం వలన అతిసారా వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవడంతో పాటు కాచి చలార్చిన నీటిని త్రాగాలన్నారు. ఎవరికైనా విరోచనాలు అయితే వెంటనే వైద్యశాలలకు వెళ్ళి చికిత్స పొందాలని సూచించారు. మెప్మా సీటీ మిషన్ మేనేజర్ డి.మాధవరావు మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాన్నారు. చిన్న వ్యాధి సంభవించిన వైద్యులను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, హెల్త్ విజిటర్ విజయ్‌కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోండి



ట్రోఫీ అందుకున్న వాలీబాల్ క్రీడాకారులు

తెనాలి అర్బన్: ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా విద్యార్థులు ప్రయత్నించాలని కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. 10, 12 తరగతుల పరీక్ష ఫలితాలు అత్యాధిక మార్కులు సాధించిన విద్యార్థుల అభినందన సభను గురువారం జగ్గడిగుంటపాలెంలోని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. కేంద్రియ విద్యాలయ సంఘటన్ డిప్యూటీ కమిషనర్ తమ పాఠశాలకు ప్రశాంస పత్రాన్ని అందించినట్లు వివరించారు. అనంతరం సత్తెనపల్లిలో 8,9 తేదీల్లో జరిగిన అండర్ -14 విభాగ బాలుర ప్రాంతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన పాఠశాల జట్టును అభినందించారు. అలాగే నిర్వాహకులు అందజేసిన ట్రోఫీని జట్టు సభ్యులకు అందజేశారు. రానున్న రోజుల్లో జట్టు జాతీయ స్థాయిలో పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ బి.రవికుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు సమాజాన్ని చైతన్యపరచాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణ దిశగా విద్యార్థులు సమాజాన్ని చైతన్యపర్చాలని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య పేర్కొన్నారు. లక్ష్మీపురంలో శ్రీచైతన్య స్కూల్ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ చాటుతూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవుల రక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి గ్రీన్ ఇండియా మిషన్ లక్ష్యమన్నారు. ర్యాలీలో ప్రిన్సిపల్ ఎం.వినీత, కో-ఆర్డినేటర్ మూర్తి, డీన్ హరిబాబు, ఏవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



డాక్టర్ పావనీ ప్రియాంకను సత్కరిస్తున్న క్లబ్ బాధ్యులు

తెనాలి: ప్రతి రోజు ఏదో ఒక సేవతో గడపటం సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తెనాలి శాఖ కార్యదర్శి, హ్యాపీ హాస్పిటల్ నిర్వాహకురాలు డాక్టర్ పావనీ ప్రియాంక అన్నారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్.రవిచంద్రన్, చిత్రా రవిచంద్రన్ దంపతుల వివాహ వార్షికోత్సవం రోజైన గురువారం ప్రపంచవ్యాప్తంగా ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారు. అందులో భాగంగా వాసవీ క్లబ్ వనిత ఆంధ్రాప్యారిస్ తెనాలి ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లోని హ్యాపీ హాస్పిటల్‌లో గర్భాశయ క్యాన్సర్ నిరోధంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డాక్టర్ పావనీ ప్రియాంక మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ లక్షణాలను, ప్రాథమికంగా గుర్తించటం, నివారణ వ్యాక్సిన్ వంటి అంశాలను వివరించారు. క్లబ్ ప్రెసిడెంట్ గంగిశెట్టి లీలారాణి, కార్యదర్శి గొల్లపూడి అనూరాధ, కోశాధికారి వక్కలగడ్డ విజయలక్ష్మి, ఐఈసీ ఆఫీసర్, ఇంటర్నేషనల్ వైస్‌ప్రెసిడెంట్ బొమ్మిశెట్టి లక్ష్మీకుమారి, కొత్తమాసు పద్మావతి, అమరా కళ్యాణి, సుగ్గుల లక్ష్మి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ పావనీ ప్రియాంకను క్లబ్ బాధ్యులు ఘనంగా సత్కరించారు.

### ఆక్రమణలు తొలగించాలి

గుంటూరు మెడికల్: ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆక్రమణదారుల పరిస్థితిపై బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ధార అంబేద్కర్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఫిరంగిపురం స్టేషన్ రోడ్డులో మురుగు కాల్వలపై ఆక్రమణదారులు నివాసం ఏర్పరచుకొని కొన్ని సంవత్సరాల నుంచి స్థానికులను పలు రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో పవన్ కుమార్, వీరేశం గుప్తా, దాసరి జోజప్ప, భ్రమరాంబ, అంజన ఉన్నారు.

## 'నీట్' మళ్లీ నిర్వహించడం తగదు




మాట్లాడుతున్న అసోసియేషన్ కన్వీనర్ మల్లేశ్వరరావు

లక్ష్మీపురం: నీట్ ప్రశ్నపత్రం లీక్ విషయంలో తిరిగి పరీక్ష నిర్వహించడం 23 లక్షల మంది విద్యార్థులకు శిక్ష వేయటమేనని, ప్రభుత్వం ఉదార వైఖరిని ప్రదర్శించి విద్యార్థులను మానసిక క్షోభ నుంచి రక్షించాలని పేరెంట్స్ అసోసియేషన్ కన్వీనర్ వీఎస్ఎన్ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన చర్చా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీట్ ప్రశ్నపత్రాలు లీక్ కావడంతో నష్టపోయిన విద్యార్థులకు రీ-టెస్ట్‌కి చివరి అవకాశం ఇస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచ్ వెల్లడించిందన్నారు. అయితే ఇది చివరి ఆప్షన్ మాత్రమేనని పేర్కొందన్నారు. రెండు, మూడు కేంద్రాల్లో పేపర్ లీక్ అయినప్పుడు 23 లక్షల మందికి తిరిగి పరీక్ష పెట్టడం ఏ తప్పూ చేయని వారికి శిక్షేనని, దీనిపై పునరాలోచించాలని కోరారు. పి.భావన్నారాయణ్, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి సంస్థ సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, సంస్థ సభ్యులు మాట్లాడారు.

### విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు



పట్నంబజారు: ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లిన విద్యార్థి కనిపించకుండా పోవడంపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారంలో నివాసం ఉండే తొమ్మిది సంవత్సరాల లంకపల్లి లోకయ్య అనే బాలుడు.. కావటి శంకరరావు మున్సిపల్ హైస్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఇంటి నుంచి ఉదయం 9 గంటలకు పాఠశాలకు వెళ్లి అక్కడ ప్రార్థన ముగిసిన తరువాత బయటకు వచ్చాడు. తరువాత ఇంటికి గానీ, పాఠశాలకు గానీ తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులను సమాచారం అడిగినప్పటికీ ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 86888 31311, 86888 31314 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

### సమాజ సేవలోనూ విద్యార్థులు ముందుండాలి

గుంటూరు ఎడ్యుకేషన్: బీ ఫార్మసీ పట్టభద్రులు ఔషధ రంగంతో పాటు జాతీయస్థాయిలో నిర్వహించే సివిల్స్ వంటి పోటీ పరీక్షల్లో సత్తా చాటి సమాజ సేవ చేయాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం బీ ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థుల ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగరాజు మాట్లాడుతూ ఫార్మసీ పట్టభద్రులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం పీజీఈ సెట్, జీ ప్యాట్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సీతారామయ్య మాట్లాడుతూ బీ ఫార్మసీ విద్యార్థులు ఎం ఫార్మసీ చదవడం ద్వారా ఔషధ ఉత్పత్తి పరిశ్రమలతో పాటు బహుళ జాతి ఔషధ సంస్థల్లో ఉన్నతమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, అధ్యాపకులు ఎన్.విజయలక్ష్మి, డాక్టర్ పి.జవహర్‌బాబు పాల్గొన్నారు.

## సమావేశానికి అధికారుల హాజరు తప్పనిసరి



పరిశుద్ధరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు

ఫిరంగిపురం: సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో విమాదేవి అన్నారు. లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ షేక్ షహేలానర్గీస్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని శాఖల అధికారులు గైర్హాజరై సిబ్బందిని పంపించడంతో ఎంపీడీవో విమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకోమారు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు ఏవో కారణాలు చూపుతూ గైర్హాజరు కావడం సరికాదని, కిందిస్థాయి సిబ్బందిని పంపించడం ఏంటని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని, లేకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తుందని చెప్పారు. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య పనులు, పరిశుభ్రమైన తాగునీరు అందేలా చూడాలన్నారు. సమావేశంలో పలువురు అధికారులు ఆయా శాఖలకు సంబంధించి పథకాల అమలు తీరు, చేసిన పనుల గురించి వివరించారు. ముందుగా ఎంపీటీసీ సభ్యుడు డి.పరిశుద్ధరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, వైస్ ఎంపీపీ జి.చంద్రం, తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



విద్యార్థులకు పుస్తకాలు బహూకరిస్తున్న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు జి. సుబ్బారావు ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు, పర్యావరణ వేత్త డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమశిక్షణతో మెలిగి ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను శ్రద్ధగా విన్నప్పుడు విజయం సాధ్యమవుతుందని వివరించారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని, ప్రణాళికతో ప్రతి సబ్జెక్ట్‌ను ఉపాధ్యాయుని ద్వారా రాబట్టుకుని చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పుస్తకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె. జోజప్ప, పి. బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## కాన్పుల మధ్య కనీసం మూడేళ్లు ఎడం ఉండాలి



వేములూరిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

ఫిరంగిపురం: బిడ్డలు కనడానికి ఇద్దరి మధ్య కనీసం మూడేళ్ల సమయం ఉండేలా మహిళలు నియంత్రణ పాటించాలని డాక్టర్ శ్వేత అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. వేములూరిపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శ్వేత మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, ఆర్థికంగా ఉండాలంటే నియంత్రణ పాటించాలని చెప్పారు. బిడ్డల మధ్య మూడేళ్ల ఎడం ఉండాలని సూచించారు. దానివల్ల మహిళలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏకే బాబు, సీహెచ్‌వో వెంకట రమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఎంపీహెచ్ఏ బాబూరావు, ఏఎన్ఎం ఆంథోనిరాణి, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



తెనాలి అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం డిపో ఆవరణలో ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు బి.సాంబశివరావు, యూనియన్ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ యూనియన్ ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జోనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ పి.యలమందయ్య, జిల్లా కార్యదర్శి వి.విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.రాజేష్ ఖన్నా, తెనాలి గౌరవ అధ్యక్షులు పి.వీరయ్యబాబు, నాయకులు ఆర్.ముక్తేశ్వరరావు, ఏవి.కృష్ణారెడ్డి, డిపో అధ్యక్ష కార్యదర్శులు కె.బాబు, ఎం.సుధాకర్‌రరావు, పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

కెప్టెన్ యర్రమనేని విజయప్రసాద్ 36వ వర్ధంతిలో ఉమామహేశ్వర్



విజయప్రసాద్ చిత్రపటానికి పుష్పాంజలి దృశ్యం

తెనాలి: దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరసైనికుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయటం మనందరి బాధ్యతగా ఉపాధ్యాయ ప్రముఖుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ అన్నారు. పట్టణ చెంచుపేటకు చెందిన ఉపాధ్యాయ ఉద్యమనేత వైఎల్ నారాయణ-మీనాకుమారి దంపతుల కుమారుడు కెప్టెన్ యర్రమనేని విజయప్రసాద్ 36వ వర్ధంతిని గురువారం అదే ప్రాంతంలోని శబరి వృద్ధాలయంలో నిర్వహించారు. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ విజయప్రసాద్ జీవిత విశేషాలను తెలియజేశారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను డాక్టరు, ఇంజినీరు చేయాలని చూస్తున్న రోజుల్లో వైఎల్ నారాయణ, మీనాకుమారి దంపతులు తమ కుమారుడు విజయప్రసాద్‌ను కోరుకొండ సైనిక్‌స్కూలుకు పంపినట్టు తెలిపారు. 12వ తరగతి వరకు అక్కడ చదివాక హిమాచల్‌ప్రదేశ్‌లోని మిలటరీ క్యాంపులో చేరి, అనతికాలంలో పారా కమాండర్ అయ్యారని చెప్పారు. 1987లో మన దేశం నుంచి శ్రీలంక వెళ్లిన 'శాంతి దళం'లో సభ్యుడిగా విజయప్రసాద్ తన సేవలను అందించినట్టు తెలిపారు. ఈ క్రమంలో 1988 జులై 11న తమిళ ఈలం టైగర్ ప్రభాకరన్ వర్గంతో జరిగిన పోరాటంలో విజయప్రసాద్ వీరమరణం పొందారని వివరించారు. అప్పటి నుంచి కుమారుడి వర్ధంతి రోజున తల్లిదండ్రులు సమాజసేవలో నిమగ్నమైనట్టు గుర్తుచేశారు. ఏటా వృద్ధులు, పాఠశాల విద్యార్థులకు ఆర్థిక చేయూతను అందిస్తున్నట్టు వివరించారు. తొంభై ఏళ్ల వయసులోనూ వైఎల్ నారాయణ ఈ సేవలను కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. తొలుత విజయప్రసాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జి.మురహరిరావు, అరి ఆనందరావు, భుజంగరావు, వేజళ్ల నవ్య తదితరులు పాల్గొన్నారు.

### వాహనం ఢీకొని వ్యక్తి మృతి



పట్నంబజారు: గుర్తుతెలియని వాహనం ఢీకొని భిక్షాటన చేసుకునే వ్యక్తి మృతి చెందడంతో.. పోలీసులు కేసు నమోదు చేశారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం నగరంపాలెం, వేణుగోపాల సెంటర్ సమీపంలో 45 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి నిత్యం భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 10న సాయంత్రం 7 గంటల సమయంలో మార్కెట్ వైపు నుంచి కలెక్టరేట్ వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో అతను తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వివరాలు తెలిసిన వారు 86888 31445కు సంప్రదించాలని తెలిపారు.